# చుక్క

రాజారావు నిద్రమొహం చూసి రెండు రోజులైంది. రెండు రాత్రులు.... అప్పుడే రెండు రాత్రులు గడిచిపోయాయి. నిద్రాదేవి రాజారావుని కరుణించడం మానేసి, ఈ వేళ కూడా నిద్ర కరువే. "రేపు.... రేపు మాత్రం నిద్రపోగలనన్న నమ్మకం ఏముంది? చిన్నగా తనలో తనే గొణుక్కున్నాడు రాజారావు.

పక్క మంచంలో చిరాగ్గా అటునించి ఇటు తిరిగాడు. మంచం పక్కనే కింద చాపలమీద వరసగా పడుకుని ఉన్నారు భార్య సుజాత, నలుగురు పిల్లలు.

"పిల్లలు ఆదమరిచి నిద్రపోతున్నారు. పగలంతా స్కూలు, ఆటలు, పేచీలు, ఏడుపులు.... పక్కమీద వాలిందే తడవు నిద్ర పట్టేస్తుంది. సుజాత మాత్రం... చీకటితో లేచింది మొదలు రాత్రి పడుకునేదాకా చాకిరీ, పిల్లల పేచీలు, గొడవలు, తిండి కరువు, నీరసం.... అలా చాప మీద అలసిన శరీరాన్ని వాల్చగానే గాఢ నిద్ర పట్టేస్తుంది కాబోలు. అందుకే అలా ఒళ్ళుమరిచి నిద్రపోతూంది.... ఛ.... ఈ ఇంట్లో తనొక్కడేనా నిద్ర సుఖం చూడలేనివాడు? తను మాత్రం పగలంతా ఆఫీసులో గుమస్తాగిరీ వెలగబెట్టి రావటంలేదూ! మరి తనకి చుక్క పడితేగానీ నిద్ర పట్టదే? వీళ్ళందరూ కిందటి జన్మలో ఏం పుణ్యం చేసుకున్నారు? ఈ జన్మలో మరే సుఖమూ అనుభవించలేకపోయినా, నిద్ర సుఖం అనుభవించగలుగుతున్నారు"....ఈర్ష్యగా భార్యా, పిల్లల వైపు చూశాడు రాజారావు. చెవుల్లో దోమల సంగీతం శృతిమించింది. ఎడమ చేతిమీద గట్టిగా ముద్దు పెట్టుకున్న దోమ నొకదాన్ని చంపడానికి కుడిచేత్తో ఒక్కటి

బాదాడు. దోమ ఎగిరిపోయింది. గట్టిగా చేతిమీద కొట్టుకున్నందుకు చేతి నెప్పి మాత్రం మిగిలింది. రోజూ చుక్క వేసుకుని మత్తుగా పడుకుంటూండటం వల్ల ఇన్నాళ్ళూ దోమల బాధే తెలియదు తనకి. ఈ రెండు మూడు రోజుల్నించే ఈ ఇంట్లో దోమల బాధెంత ఎక్కువగా ఉందో తెలుస్తూంది.... అంత విసుగులోనూ చిన్నగా నవ్వినట్టు కదిలాయి రాజారావు పెదవులు.

గట్టిగా, భారంగా నిట్టూర్చాడు.

నిద్రపట్టని విసుగు. చుక్కపడని చిరాకు. రెండు మూడు రోజులుగా చుక్క పడక నాలిక తడి ఆరిపోయింది. పెదవులు ఎండిపోయాయి. మనసు మొద్దుబారిపోయింది. గుండె మండిపోతూంది. అర్థంలేని కోపం, అంతులేని విసుగు చేరువయ్యాయి.

ఈరోజు కూడా నిద్ర తన చేరువకిరాదని నిశ్చయించుకుని చివాలున మంచం దిగాడు. కిర్రుమంది కుక్కిమంచం. పెరటి తలుపు తీసుకుని బయటికి నడిచాడు. చీకటిచీకగా ఉంది. పెరటిగోడ అవల్నించి వీధిదీపం కాంతి కొద్దికొద్దిగా పడుతూంది. బొగడచెట్టుకింద రాతిమీద కూలబడ్డాడు. 'ఆరుబయట చల్లగా ఎంతబావుంది! లోపల ఆ వుక్కలో, ఆ దోమల సంగీతంలో నిద్రపోగలుగుతున్న సుజాత, పిల్లలు అదృష్టవంతులే నిద్రవిషయంలో'. చుక్కపడితేగాని నిద్ర పట్టని బ్రతుకైంది తనది.

రెండు మూడు రోజులబట్టి చేతిలో పైసా ఆడక గొంతుతడుపుకోలేదు. ఇంత కటికదరిద్రం అనుభవించడం ఎంత కష్టం. ఈ నెల్లో చుట్టాల రాకపోక లెక్కువ ఇంట్లో పిల్లల జబ్బు లెక్కువ. భార్య నీరసం ఎక్కువ. చుక్కలేసుకోడం ఎక్కువ. అప్పులెక్కువ. చివరికైంది డబ్బు తక్కువ. ఇంక అప్పులిచ్చేవాడు లేదు. తీర్చవలసిన బాకీలెన్నో ఉండగా మళ్ళీ తెలిసి తెలిసి ఎవరిస్తారు అప్పు? సుజాతకి పుట్టింటివాళ్ళు పెట్టిన ఆ ఒక్క గొలుసూ తాకట్టులో వుంది. ఇంట్లోవున్న కాస్త

ఇత్తడిసామాను ఒక్కొక్కటిగా కాళ్ళొచ్చి నడిచిపోయాయి. ఇంకేం మిగిలింది ఇంట్లో అమ్ముకుందుకు? భార్య, పిల్లలూ ఉన్నారు. పిచ్చిగా నవ్వుతున్నాడు రాజారావు. ఆ మహా మహా ధర్మరాజంతటి వాడే భార్యని పణంగా ఒడ్డి ఆడాడు. అటువంటప్పుడు తనవంటి దరిద్రుడు మూడురోజులుగా ఎండిపోయిన గొంతు తడుపుకుందుకు భార్యని అమ్మజూపితే! తప్పా!" రాజారావు మనసుకి ముల్లుగుచ్చుకుంది. గట్టిగా రెండుసార్లు చెంపలు వాయించుకున్నాడు. మళ్ళీ అంతలోనే నవ్వొచ్చింది ... పాపం! సుజాత! దేవుడిలా తనని ఆరాధిస్తోంది. భారత స్త్రీగా పుట్టిందగనక.... కానీ, తను సుజాతని ప్రేమగా చూసిందెప్పుడు? లక్ష్యపెట్టిందెప్పుడు? ఔను ఎలా ప్రేమించగలడు? అమ్మా, నాన్నల కోసం సుజాత మెళ్ళో ముడివేసిన తను, తారని పూర్తిగా మరిచిపోయి సుజాతని మనస్ఫూర్తిగా ప్రేమించలేక పోతున్నాడు.... తార.... ఒకప్పుడు తన మనసు దోచుకున్న తార.... ఇప్పటికీ తన కలల్లో కనిపించి కవ్విస్తున్న తార.... ఏదీ.... ఎక్కడుంది?...."

* * *

ఆరుబయిట మంచంమీద తనపక్కన పడుకున్న కొడుకుని అడిగాడు వెంకట్రావు. "చుక్కలెన్నో లెక్కబెట్టరా! రాజా!" అయోమయంగా తన చొక్కావైపు చూసుకున్నాడు రాజా.

"నా చొక్కామీద చుక్కల్లేవు. గీతలేవున్నాయి." చొక్కా మీది డిజైను మళ్ళీ మళ్ళీ చూసుకున్నాడు.

"ఓరి నీ! చుక్కలంటే నక్షత్రాలురా." అంటూ ఆకాశంకేసి చూపెట్టాడు వెంకట్రావు.

"చుక్కలు.... చుక్కలు...." పదేపదే ఆమాట అనుకుంది రాజా చిన్నమనసు. కొత్తగావుంది ఆ మాట.

నక్షత్రాల్ని చుక్కలని కూడా అంటాలని మొట్టమొదటిసారి ఆ రోజే తెలిసిన రాజాకి, ఆ మాటెంతో బాగున్నట్టనిపించింది కూడా.

నక్షత్రాలంటే ఇష్టమైనరాజా, "నీకన్నిట్లోకి ఇష్టమైన దేమిట్రా?" అని ఎవరన్నా అడిగితే చాలు...."చుక్కలు" అనేవాడు చటుక్కున.

హైస్కూల్లో చదివే రోజుల్లో 'చందమామకంటే కూడా చుక్కలే అందంగా ఉంటాయని' వాదించేవాడు స్నేహితుల్తో. తన క్లాసు పుస్తకాలన్నిటిమీద, అట్టలమీద నక్షత్రం మార్కు వేసుకునే వాడు.

"ఇదేమిట్రా! ఏదో వోటు గుర్తులా ముద్రలేమి టన్నిటిమీదా?" అని స్నేహితులు వెళాకోళమాడేవారు.

ఎటొచ్చీ రాజారావు కాలేజీ జీవితంలో కథ తారుమారైంది. చుక్కలంటే ఇష్టపడే రాజారావు మనిసుని కాలేజీలో ఓ చుక్క దోచుకుంది.

"నాకు ప్రియాతి ప్రియమైన ఆ చుక్కపేరే నీ పేరవడం నిజంగా నా అదృష్టం, తారా!" అన్నాడు రాజారావు తారతో పరిచయం పెరిగాక.

"కొంపదీసి నాపేరు చూసి నన్ను ప్రేమించటం లేదుకదా!" అంటూ చిలిపిగా నవ్వింది తార.

తారని ప్రేమించిన తను, అమ్మా నాన్నల ఆంక్షలికి తలవంచక తప్పలేదు. ఇష్టంలేకపోయినా సుజాతని పెళ్ళాడక తప్పలేదు. మనసులో నిలిచిపోయిన తార, మరచిపోలేని తార, ఇష్టంలేని సంసారం, యాంత్రిక జీవితం, పిల్లలు, రోగాలు, మందులు, అప్పులు, నీరసం.... మనోవ్యాధికి మందు లేకపోవడ మేమిటి? ఉందంటూ స్నేహితులు చుక్క వేసుకోవడం అలవాటు చేశారు తనకి. తన బాధలన్నీ మరిపింపచేస్తూ, తన దరిద్రాన్ని, గతాన్ని జ్ఞప్తికి రానివ్వకుండా కంటినిండా నిద్రనిచ్చే చుక్క తన ప్రాణంలో ప్రాణమైపోయింది. ఇల్లు గుల్లయిపోయినా, శరీరం శిధిలమైపోతున్నా చుక్కని దూరంగా వుంచలేకపోతున్నాడు తను. ఆ మందుకి దాసుడైపోయాడు. తన జీవితానికీ,

'చుక్క' అన్న రెండక్షరాలకీ ఎంత ముడిపడి ఉందో తలుచుకున్న కొద్దీ ఆశ్చర్య మనిపించింది.

దూరంగా ఎక్కడో కుక్కలు మొరుగుతున్నాయి. ఉలిక్కిపడి ఆలోచనల్లోంచి తేరుకున్నాడు రాజారావు.

అప్రయత్నంగా తలయెత్తి చూశాడు. పైన చుక్కలు మెరుస్తున్నాయి.

మూడు రోజులుగా చుక్క పడని నోరు జ్వరం వచ్చినట్టుగా ఉంది....తడారిపోయిన గొంతు .... నిద్రలేక కళ్ళు మంటలు....వాటికి తోడు నేనూ వున్నానంటూ సన్న సన్నగా కడుపులో నెప్పి మొదలైంది.

కాసేపు భరించగలిగాడు కానీ, ఆపైన ఇంక ఇసుకుపట్టింది కడుపులో నెప్పితో. పెరటి తలుపు గడియవేసి, గదిలోకి నడిచాడు.

"సుజాతా" అని ఒక్కసారి పిలవగానే అంత నిద్దరలోనూ చటుక్కున లేచింది సుజాత.

"ఏమిటండీ? ఏం కావాలండీ?" కంగారుగా భర్త మొఖంలోకి చూసింది.

"కడుపులో నెప్పిగావుంది. ఉప్పూ, వామూ కలపి ఇయ్యి నమిలితే తగ్గుతుందేమో!"

భార్యవెనకే తనుకూడా వంటింట్లోకి నడిచాడు.

తలుపుల్లేని అలమారాలో ఉప్పు రాచ్చిప్ప ఇవతలకి జరుపుతుంటే దానికిందున్న ఉత్తర మొకటి జారి కిందపడింది. కంగారుగా చటుక్కున ఆ ఉత్తరం తీసుకుని ఉండలా చుట్టేసి గుప్పిట్లో పెట్టుకుంది సుజాత.

అనుమానంగా చూశాడు రాజారావు.



కథా నిలయం
3881
శ్రీకాకుళం

"ఏమిటా ఉత్తరం ?"

మాట్లాడలేదు సుజాత.

"నిన్నే ! ఎవర్రాశారది ?"

"ఇదా ? ఇది....తడబడింది సుజాత.

భయం భయంగా భర్త కళ్ళల్లోకి చూస్తూ ఉండిపోయింది.

కడుపునెప్పి కంటే పెరిగింది రాజారావులో అనుమానం. నెప్పి సంగతి మరిచేపోయాడు.

"ఎవడు రాశాడు నీకది ? చెప్పవేం అడుగుతుంటే ?"

ఉత్తరం గుప్పిట్లోవున్న సుజాత చెయ్యి వణికింది, కళ్ళల్లో దైన్యం తొంగిచూసింది. అదురుతున్న పెదాలు అదుపులో పెట్టుకుందుకు వ్యర్థప్రయత్నం చేస్తూ చిన్నగా అంది "ఈ ఉప్మా, వాము నమలండి."

"మాట తప్పించాలని చూస్తున్నావా ? ఎవడు రాశాడు నీకా ఉత్తరం ? ఎప్పటినించీ ఈ నాటకాలు ?" రాజారావు చెయ్యి బలంగా సుజాత చెంపని తాకింది. మరుక్షణమే ఉత్తరంకూడా లాక్కున్నాడు.

ఎర్రబడ్డ చెంపని చేత్తో రాసుకుంటూ, నీరసంగా గోడకి చేరబడింది సుజాత. ఉత్తరం మడత విప్పాడు రాజారావు, కసిగా ఓ సారి భార్యవంకచూసి,

"డియర్ సుజాతా...." ఈ విధంగా సంబోధిస్తూ రాసేవాళ్ళెవరూ లేరు సుజాతకి. తప్పకుండా వీడెవడో చాలా రోజులబట్టి నడుపుతున్నాడన్నమాట వ్యవహారం తనకి తెలియకుండా. అసలు వీడెవడో? పూర్తిగా చదివేదాకా ఆగే సహనం లేక గబగబా ఆత్రుతగా కింద సంతకం చూశాడు. 'నీ స్నేహితురాలు—తార.'

ఉలిక్కిపడ్డాడు. ఎవరు ? ఎవరీ తార ? ఒకవేళ....

ఆలోచించడానిక్కూడా భయం వేసింది.

గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నట్టనిపించింది.

వణుకుతున్న చేతులకి ఉత్తరం ఎంతో బరువుగా తోచింది. మరింత గట్టిగా దాన్ని పట్టుకుని చదవడం మొదలుపెట్టాడు.

"డియర్ సుజాతా,

నీ ఉత్తరం అందింది. నీ అంత మంచి వాళ్ళు నూటికొకరు కూడా ఉంటారో, ఉండరో! నీ ఉత్తరం చదువుకుని నీ అమాయకత్వానికి నవ్వుకున్నాను. మనిద్దరం మీ ఊళ్ళో హైస్కూల్లో మూడేళ్ళు కలిసి చదువుకున్న సంగతి మీ వారికి చెప్పలేదన్న మాట నువ్వు! ఎలాగైతేనేం, కష్టపడి నా అడ్రెసు సంపాదించి ఉత్తరం రాశావు. నీ అమాయకత్వానికి నవ్వూ, నీ మంచి తనానికి జాలీ పుట్టుకొస్తున్నాయి. మీ శ్రీవారి సుఖసంతోషాలు తప్ప మరేమీ అక్కర్లేదా నీకు? నిత్యం నువ్వనుభవిస్తున్న దరిద్రం కంటే కూడా మీ వారి మనోవేదనకే నువ్వెక్కువ చింతిస్తున్నావా? రాజారావుని ప్రేమించి అతణ్ణి పెళ్ళిచేసుకోలేక పోబట్టి అతని మీది ప్రేమతోనే నేనిలా బ్రహ్మచారిణిగా ఉండిపోయానన్న నీ వెర్రి భ్రమకి నాకెంత నవ్వొస్తూందో చెప్పలేను. నేనొచ్చి రాజారావుకి భార్య కావడానికి ఒప్పుకుంటే, నువ్వు పిల్లల్ని తీసుకుని మా కడ్డు లేకుండా ఎక్కడికో వెళ్ళిపోతానని వ్రాశావు. పిచ్చిదానా! ఈ తార సుజాతలాంటి అమాయకురాలు కాదు. ఇది ఒక్తి గడుసుది. రాజారావుతో నా పెళ్ళి జరగలేదని నేను సంతోషించని క్షణం లేదు."

చదువుతున్న రాజారావు నెత్తిన పిడుగు పడినట్టయింది. కలో, నిజమో తెలియని స్థితిలో మళ్ళీ కళ్ళు ఉత్తరం మీదకి తిప్పాడు.

"రాజారావుతో నా పెళ్ళి కాకపోవడం భగవంతుడు నాకు చేసిన మేలు ఏదో, మొదట్లో తెలియక మోజుకొద్దీ అతనితో స్నేహం చేశాను. దానికి "ప్రేమ" అని పేరు పెట్టుకున్నాం. కానీ, అప్పట్లో నా మన

నేమిటో నాకే పూర్తిగా అంతు తెలియదు. పెళ్ళిచేసుకుని కట్టుకున్న వాడితో జీవితాంతం ఒకే రకం జీవితం గడపగలిగే స్వభావం నాది కాదని తెలుసుకున్నాను. అందుకే ఇప్పటి దాకా కూడా పెళ్ళి చేసుకో కుండా ఉన్నాను. ఉంటాను. జీవితంలో అనుభవించవలసిన అన్నిరకాల ఆనందాలూ ఏ అడ్డూ లేకుండా అనుభవిస్తున్నాను. స్వతంత్రంగా జీవిస్తున్నాను. సంఘానికి భయపడదలచుకోలేదు. డబ్బుకి కొదవ లేదు. సుఖాలకి కొదవలేదు. స్నేహితులకి కొదవలేదు. నా మీద అజమాయిషీ చేసే ప్రాణి లేదు. నాకీ జీవితమే బాగుంది. నేనే కనక రాజారావుని పెళ్ళి చేసుకుని ఉంటే ఆగర్భ దరిద్రం అనుభవించలేక రెండో రోజే ఇంట్లోంచి పారిపోయి ఉండేదాన్ని. నువ్వు కాబట్టి అటు వంటి బ్రతుకీడ్చుకు రాగలుగుతున్నావు. ఆఖరిసారిగా చెపుతున్నాను.... రాజారావుతో గతంలో నేను చేసిన స్నేహానికి "ప్రేమ" అన్న పేరు చెరిపి నీకు నచ్చిన మరో పేరేదన్నా పెట్టుకో. నా బోటిదాన్ని నీ బోటి సంసారులు మరిచిపోవడం మంచిది. ఉంటాను.

నీ స్నేహితురాలు
—తార

కాళ్ళకింద భూమి కదిలిపోతున్నట్టుంది రాజారావుకి. గుండెల్లో బాధ. అదో రకమైన .... మునుపెన్నడూ అనుభవించి ఎరగని బాధ. మెడమీద, నుదుటి మీద విపరీతంగా చెమట్లు పట్టాయి.

సుజాత కెప్పుడో తెలుసన్న మాట తన ప్రేమ వ్యవహారం — తెలియదనే అనుకుంటున్నాడు తను ఇన్నాళ్లుగా.

తెలిసి కూడా తనమీద ప్రేమ ఎలా చూపించ గలుగుతూంది! తను ఒక్కమాట మాట్లాడితే చాలు, మురిసిపోతుందే? తిట్టినా కోపం తెచ్చుకోకుండా చిరునవ్వుతో తన పని తను చేసుకుపోతుందే? ఎందుకు? తన గత చరిత్ర తెలిసికూడా తెలియనట్టే అతి మామూలుగా ఎలా ఉండ

గలుగుతూంది? పోనీ గతం వదిలేసినా .... ఇప్పుడు వర్తమానంలో మాత్రం, తను ప్రవర్తిస్తున్న తీరు సరి అయినదా? ఇల్లు గుల్లచేసి తాగుతున్నాడే। ఇంట్లో దరిద్రం తాండవిస్తూందే। ఒక్కనాడయినా ప్రేమగా మాట్లాడాడా? ఒక్కనాడయినా భార్య ముద్దుముచ్చట్లు తీర్చాడా? ఏ సుఖానికీ నోచుకోని బ్రతుకైనా కూడా తననీ, ఈ ఇంటినీ వదిలి వెళ్ళిపోవాలని ఏనాడైనా చూసిందా? ఏనాడైనా తన మాట కాదందా? పైగా తన వేదన చూడలేక, తన మనసెప్పటికీ మారదని నిశ్చయించుకుని, తార ఎక్కడ ఉన్నదీ తెలుసుకుని ఉత్తరం వ్రాసిందన్న మాట చివరికి. తను దీపమై కాలిపోవడానికి నిశ్చయించుకుంది. భర్తకి సుఖశాంతులనే వెలుగు నివ్వదలుచుకుంది .... భగవాన్! .... తారని హృదయంలో ప్రతిష్ఠించుకుని, దేవతలాంటి సుజాతని కాలికింద వేసి తొక్కుతున్నాడు తను.... ఏ శిక్ష వేసినా చాలదు తనకి."

"సుజాతా" అప్రయత్నంగా ఆ మూడక్షరాలూ పలికాయి పెదవులు.

మరుక్షణం చేతులు ముందుకి చాపాడు.

కలువ కాడలా ఆ చేతుల్లో వాలిపోయింది సుజాత.

"నే నడిగిన వెంటనే ఆ ఉత్తరం ఇచ్చిఉంటే కొట్టి ఉండేవాడిని కాదు. అనవసరంగా నిన్ను కొట్టాను. ఎందుకు సుజాతా ఉత్తరం చూపించడానికంత వెనకాడావు?" రాజారావు గొంతులో పశ్చాత్తాపంతో కూడిన ఆప్యాయత వెల్లువలై పొంగింది.

"నీ మనసులో అపురూపంగా ప్రతిష్ఠించుకున్న తార అసలు రూపు బయటపడితే మీరు మరింత వేదనకి లోనవుతారేమోనని భయపడ్డాను."

ఆ జవాబులోని మంచితనం సూటిగా రాజారావు హృదయాన్ని తాకింది. అతనిలోని మానవత్వాన్ని తట్టి లేపింది. కన్నుల్లో నీరు తిరిగింది. వాలిన రెప్పల్లోంచి "టప్" మని సుజాత తలమీద పడింది ఒక "చుక్క".

★